మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



మహిళలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, ఎమ్మెల్సీ రుహుల్లా, మేయర్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీశైలజ, కార్పొరేటర్ షాహీనా సుల్తానా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి అని, రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలను మహారాణులుగా తీర్చిదిద్దేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. వైఎస్సార్ ఆసరా ముగింపు కార్యక్రమం సింగ్‌నగర్ 59వ డివిజన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ ఎండీ షాహీనాసుల్తానాతో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డ్వాక్రా మహిళలతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే విష్ణు మాట్లాడారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం మహిళలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుందని విమర్శించారు. మహిళలకు ఇచ్చిన హామీలన్నీ మర్చిపోయి ఎన్నికల ముందు పసుపు, కుంకుమ అంటూ చంద్రబాబు మోసం చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఆడపడుచులంతా తమ కాళ్లపై తాము నిలబడాలనే ఆకాంక్షతో ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళల పేరుమీద అందిస్తున్నామని వివరించారు. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళల జీవితాల్లో అసలైన వెలుగులు విరజిల్లుతున్నాయని పేర్కొన్నారు. పదవులు, ఉద్యోగాలు, సంక్షేమ పథకాల్లో ప్రతి చోటా మహిళలకే అధిక ప్రాధాన్యం కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని చంద్రబాబు మొసలి కన్నీరు కార్చి, అబద్ధపు హామీలతో మహిళలను మోసం చేయాలని చూస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా లోకమంతా 2019లో ఇచ్చిన దానికన్నా మరింత గుబ గుయ్ మనేలా టీడీపీకి బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీ, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడారు. అనంతరం డ్వాక్రా మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. పీఓ యూసీడీ శకుంతల, జోనల్ కమిషనర్ సృజనా, సీడీఓ జగదీశ్వరీ, వైఎస్సార్‌సీపీ నాయకులు నందెపు సురేష్, ఎండీ హాఫీజుల్లా, దేవిరెడ్డి రమేష్‌రెడ్డి, అమితాబ్, రాజు, చెఇంతా శ్రీను, కొండా జయలక్ష్మీ, పిల్లి లక్ష్మీ పాదుపు సంఘాల మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు



సత్యనారాయణపురంలో 'జగనన్నే మా భవిష్యత్తు' పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో 'మా నమ్మకం నువ్వే జగనన్నా' అన్నది ప్రజల నినాదంగా మారిపోయిందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సత్యనారాయణపురంలోని గాయత్రీ కన్వెన్షన్ సెంటర్‌లో 'జగనన్నే మా భవిష్యత్తు' పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం మల్లాది విష్ణు అధ్యక్షతన నిర్వహించారు. డిప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డితో పాటు సెంట్రల్ నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ ప్రజలతో మమేకమయ్యే భారీ కార్యక్రమానికి ఈ నెల 7 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సీఎం జగన్ శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరును ప్రతి గడపకు తెలియజేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. పార్టీ తరపున సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి 14 రోజుల పాటు పకడ్బందీగా కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. విద్య, వైద్య, గృహ నిర్మాణ రంగాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. ఇంత చేస్తున్నా ఏదో రకంగా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసే కార్యక్రమాలు ప్రతిపక్షాలు చేస్తున్నాయని, వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సెంట్రల్ నియోజకవర్గంలోని 96 సచివాలయాల పరిధిలో 1,400 క్లస్టర్లు ఉండగా అందులో 3 వేల మంది గృహ సారథులు, 300 మంది కన్వీనర్లు ఉన్నట్లు వెల్లడించారు. వీరంతా గత ప్రభుత్వానికి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి మధ్య గల వ్యత్యాసాన్ని ప్రజలకు సవివరంగా వివరించాలని కోరారు. అలాగే ప్రభుత్వం పనితీరుపై ప్రజల అభిప్రాయాన్ని, వారి సంతృప్తిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ కన్వీనర్లు, గృహ సారథులు ముందుకు సాగాలన్నారు. లబ్ధిదారుల అనుమతితో మొబైల్ ఫోన్‌తో పాటు ఇంటి డోర్‌కు స్టిక్కర్‌ను అతికించే కార్యక్రమం చేపట్టాలని తెలియజేశారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు శర్వాణీ మూర్తి, బాలి గోవింద్, ఎండి షాహినా సుల్తానా, అలంపూరు విజయలక్ష్మి, కొండాయిగుంట మల్లేశ్వరి, ఇసరపు దేవి, ఉద్దంటి సునీత, కుక్కల అనిత, పెనుమత్స శిరీష, బంకా శకుంతల, జానారెడ్డి, నాయకులు ఆత్మకూరు సురేష్, గుండె సుందర్ పాల్, కనపర్తి కొండా, దోనేపూడి శ్రీనివాస్, అఫ్రోజ్, కాళ్ల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీకి తగినట్లుగా నైపుణ్యాలు

ఉత్సాహంగా సాగిన ఎలక్ట్రోవిజన్-2023



మాట్లాడుతున్న ఎఫ్‌ట్రానిక్స్ అధినేత రామకృష్ణ



ఫ్యాషన్ షోలో విద్యార్థినులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): కొత్తగా వచ్చే సాంకేతిక పరిజ్ఞానం (టెక్నాలజీ)కి తగినట్టుగా యువత అప్‌డేట్ అవుతూ ఆ టెక్నాలజీలో నైపుణ్యాలను పెంచుకోవాలని ఎఫ్‌ట్రానిక్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణ చెప్పారు. సిద్ధార్థ కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం సిద్ధార్థ ఆడిటోరియంలో ఎలక్ట్రోవిజన్-2023 పేరుతో విద్యార్థులకు సాంకేతిక, సాంస్కృతిక అంశాల్లో పోటీలు నిర్వహించారు. రామకృష్ణ అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. టెక్నాలజీకి తగినట్లుగా నైపుణ్యాలు ఉన్న యువతకే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. బ్యాంకింగ్ రంగంలో కంప్యూటర్లను ప్రవేశపెట్టినప్పుడు బ్యాంక్ ఉద్యోగులు ఆ రంగంలోని యూనియన్లు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. కంప్యూటర్ వల్ల కొంత మంది ఉద్యోగాలు పోయినా, టెక్నాలజీ పెరగడంతో బ్యాంకింగ్ రంగంలో ఇప్పుడు ఎక్కువ మంది కొత్తగా ఉద్యోగాలు పొందారన్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒక సారి టెక్నాలజీలో పూర్తిగా మార్పులు వస్తాయని, ఆ మార్పులకు తగట్టుగా యువత తమలోని నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. కళాశాల డీన్ రాజేష్ సీ.జంపాల మాట్లాడుతూ తల్లిదండ్రులు, కళాశాలతో పాటుగా మన రాష్ట్రానికి మంచి పేరు తెచ్చేలా యువత తయారు కావాలన్నారు. ప్రిన్సిపాల్ ఎం.రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి గత పది సంవత్సరాలుగా ఈ ఎలక్ట్రోవిజన్‌ను నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి కేవీఎస్ సాంబశివరావు మాట్లాడుతూ భవిష్యత్తు అంతా టెక్నాలజీ రంగంపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఈ రంగంలోనే యువతకు ఉద్యోగాలు ఎక్కువగా ఉంటాయన్నారు.

ఉత్సాహంగా సాగిన పోటీలు

ప్రారంభ సభ అనంతరం నిర్వహించిన సాంస్కృతిక, సాంకేతిక పోటీల్లో వివిధ కళాశాలల నుంచి విచ్చేసిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోస్టర్, పేపర్ ప్రజంటేషన్, ప్రాజెక్ట్ ఎగ్జిబిట్, టెక్నికల్ క్విజ్, సర్క్యూట్ డిజైనింగ్, ఐసీ ఐడెంటిఫికేషన్, స్పాట్ ఫోటోగ్రఫీ, ట్రెజర్ హంట్, ఫ్యాషన్ షో, కాయిన్ ఫైండింగ్ పోటీల్లో పాల్గొని వారిలోని ప్రతిభను చూపారు. అనంతరం వివిధ సినిమా పాటలకు విద్యార్థులు డ్యాన్సులు చేసి అదరగొట్టారు. అనంతరం విద్యార్థులు ఫ్యాషన్ షో ర్యాంప్ వాక్ చేసి అలరించారు. ముగింపు సభలో పోటీల విజేతలకు బహుమతులను అందచేశారు.

ఆర్‌సీటీ మెంబర్‌గా జాన్‌ప్రసాద్



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ (ఆర్‌సిటి) అమరావతి బెంచ్ టెక్నికల్ మెంబర్‌గా జి.జాన్‌ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన దక్షిణ మధ్య రైల్వేలో ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 1986 ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ బ్యాచ్‌కు జాన్‌ప్రసాద్‌కు కమర్షియల్, ఆపరేషన్, క్లెయిమ్స్ సెటిల్‌మెంట్ విభాగాలతో పాటుగా అన్ రిజర్వ్‌డ్ టిక్కెటింగ్ సిస్టంలో అపారమైన అనుభవం ఉంది. ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్ మేనేజర్‌గా సౌత్ వెస్ట్రన్ రైల్వే, హుబ్లి డివిజన్‌తో పాటు ఇండియన్ రైల్వేలలో అనేక కీలక పోస్టుల్లో పనిచేశారు.

రాష్ట్ర జూడో సంఘ సీఈవో వెంకట్‌పై కేసు నమోదు

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన్ నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై అసోసియేషన్ సీఈవో నామిశెట్టి వెంకట్‌పై విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. 2018 నుంచి 2022 వరకు ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన్‌కు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) విడతల వారీగా మంజూరు చేసిన రూ.52 లక్షలను నామిశెట్టి వెంకట్ తన సొంతానికి వాడుకుని దుర్వినియోగం చేశారని అసోసియేషన్ మాజీ కోశాధికారి శ్రీధర్ గతంలో ఆరోపించారు. ఈ మేరకు నాలుగు నెలల క్రితం శాప్, పోలీసులకు ఫిర్యాదు చేశారు.





భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ



పౌర్ణమి నేపథ్యంలో దుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి చుట్టూ భక్తులు గురువారం భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ చేశారు. గంగా పార్వతి సమేత మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులు కొలువై ఉన్న ప్రత్యేక వాహనాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. కొండ చుట్టూ సుమారు 8 కిలోమీటర్ల మేర ప్రదక్షిణ సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా

లీ గార్మెంట్ షోరూమ్ ప్రారంభం



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): అంతర్జాతీయ లీ బ్రాడెండ్ గార్మెంట్ షోరూమ్ విజయవాడ నగరంలో ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లాది విష్ణు చెప్పారు. స్థానిక గాయత్రినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన లీ గార్మెంట్ స్టోర్‌ను ఎమ్మెల్యేలు గురువారం హాజరై ప్రారంభించారు. షోరూమ్ అధినేతలు సూర్యనారాయణ, శిరీష్, సునీల్ మాట్లాడుతూ అంతర్జాతీయ బ్రాండెడ్ అయిన లీ గార్మెంట్స్‌ను నగర వాసులకు అందచేయాలనే ఉద్దేశంతో స్టోర్‌ను ప్రారంభిస్తున్నామన్నారు.

9న చెస్ టోర్నమెంట్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఈ నెల 9వ తేదీ ఉమ్మడి కృష్ణా జిల్లా అండర్ 9 ఓపెన్ అండ్ గరల్స్ చెస్ టోర్నమెంట్‌ను సూర్యారావుపేటలోని గ్రోయింగ్ మైండ్స్ ప్లే స్కూల్లో నిర్వహించనున్నట్లు స్కూల్ నిర్వాహకురాలు ప్రసన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేతలకు నగదు, మెడల్ పురస్కారం అందిస్తామన్నారు. విభాగాల వారీగా పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన చిన్నారులు 8978596865 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీతారాములకు ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): సీతారాముల కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం మాచవరం డౌన్‌లో షిరిడీ సాయిబాబా భజన ఘనంగా నిర్వహించారు. తొలుత సీతారాములకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు సీతారాములను దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఉత్సవ కమిటీ అధ్యక్షులు కంచర్ల వెంకట రాంబాబు, కోశాధికారి ఎన్‌వీఆర్ గౌరవాధ్యక్షులు సీహెచ్ నాని పర్యవేక్షించారు.

నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



మధురానగర్(విజయవాడసెంట్రల్): రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని గురువారం పౌరసరఫరాల శాఖ అధికారులు అదుపులోకి తీసుకొని 410 కిలోల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. నేతాజీకాలనీకు చెందిన ఎస్ కే నజీర్ చుట్టుపక్కల నివాసాల వద్ద రేషన్ బియ్యం కిలో పది రూపాయలకు కొనుగోలు చేస్తున్నాడు. సమాచారం అందుకున్న పౌరసరఫరాల శాఖ సర్కిల్ టూ ఏఎస్ఓ ధనుంజయరెడ్డి , చెకింగ్ ఇన్‌స్పెక్టర్ భగీరథ దాడి చేసి నిందితుడు ఎస్‌కే నజీర్‌ను అదుపులోకి తీసుకున్నారు. నజీర్ పై 6 ఏ కేసు నమోదు చేశారు

దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో అనేక చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. వేసవితాపాన్ని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. ఈ ఏడాది ఎండలు మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నగరంలోని అన్ని ప్రధాన కూడళ్ల వద్ద చలివేంద్రాలను ఏర్పాటుచేయనున్నామన్నారు. అనంతరం స్థానికులకు, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు.

దుర్గమ్మ సన్నిధిలో ద్వాదశ ప్రదక్షిణలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): చైత్రమాస బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం అమ్మవారి ఆలయంలో ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించారు. అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులతో కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆది దంపతుల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై ఊరేగిస్తూ అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ ఆది దంపతులకు పూజలు నిర్వహించారు.

గురు సంప్రదాయం పరిరక్షించుకోవాలి



వేదసభలు నిర్వహిస్తున్న పండితులు

విజయవాడ కల్చరల్: గురు సంప్రదాయం పరిరక్షించుకోవాలని, సద్గురువుల బాటలో పయనించాలని వేదపండితులు విష్ణుభొట్ల లక్ష్మీనారాయణ ఘనాపాటి సూచించారు. కృష్ణా మండల వేద విద్వత్పవర్థక సభ ఆధ్వర్యంలో సత్యనారాయణపురం బులుసు లలితామణి కల్యాణమండపంలో వేద పరీక్షల రెండవరోజు కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ విద్యార్థులు చిత్తశుద్ధి, ఏకాగ్రత, లక్ష్యం కలిగి ఉండాలని చెప్పారు. కష్టపడితే విజయం వరిస్తుందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేదపండితులు గురువందనంతో ప్రారంభించి వేదపఠనం చేశారు. విష్ణుభొట్ల సుబ్రహ్మమణ్య ఘనాపాటి ముఖ్య పరీక్ష అధికారిగా పర్యవేక్షించారు. కృష్ణామండల వేదవిద్వత్పవర్ధక చైర్మన్ మాగంటి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ శుక్రవారం ఉదయం లబ్బీపేట శ్రీ శారదాచంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో కంచికామకోటి పీఠాధిపతి శంకరవిజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో పండిత సభ జరుగుతుందని తెలిపారు. సాయంత్రం జరిగే కార్యక్రమంలో వేదపరీక్షలో విజయం సాధించిన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు.

ధర్మానికి ప్రతిరూపం శ్రీ రామచంద్రుడు



సీతా కల్యాణం కథాగానం చేస్తున్న గుడిపాటి సుధాకర్

విజయవాడ కల్చరల్: మూర్తీభవించిన ధర్మానికి ప్రతిరూపం శ్రీ రామచంద్ర ప్రభువని ఆధ్యాత్మిక వేత్త గుడిపాటి జయరాం సుధాకర్ అన్నారు. శ్రీరామభక్త సేవా మండలి ఆధ్వర్యంలో గురువారం సత్యనారాయణపురం సీతారామమందిరంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా గుడిపాటి సుధాకర్ రామాయణంలో రమణీయత అంశంగా ప్రసంగం, సీతా కల్యాణం కథాగానం చేశారు. భారతీయుల ఆరాధ్యదైవం శ్రీ రామచంద్రుడుని, ఆయన జీవితం సర్వజనులకు ఆదర్శనీయమన్నారు. అష్టాదశ కావ్యాలలో రామాయణాన్ని మించిన కావ్యంలేదని తరాలు మారుతున్నా యుగాలు మారుతున్నా రామాయణం ఎప్పటికీ నిత్యనూతనమేనన్నారు. మహర్షి వాల్మీకి అందించిన కావ్యం రామాయణమని ధర్మం తప్పితే ఎంతటి వారికైనా శిక్షతప్పదని వివరిస్తూ సీతా కల్యాణం వరకు జరిగిన అనేక సంఘటనలను వివరించారు. మృదంగంపై జగన్మోహిని సహకరించారు. గుడిపాటి దత్తు పాల్గొన్నారు.

పేదల జీవన ప్రమాణాలు పెంపుదలే ధ్యేయం



ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, పక్కన డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిరుపేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే ధ్యేయమని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 63వ డివిజన్ 276వ వార్డ్ సచివాలయం పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం గురువారం నిర్వహించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ కలిసి ఆయన 225 గడపలను సందర్శించారు. స్థానిక ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా వీక్షించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. నిరుపేద ప్రజల కోసం జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించి, అర్హులైన వారంతా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అబద్ధానికి.. నిజానికి తేడా గమనించండి...

అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ గతంలో అబద్ధపు హామీలతో పేదలను మోసం చేసిన ఘనుడు చంద్రబాబు అని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలుచేసి నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపిన యోధుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని చెప్పారు. అబద్ధాలకు, వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అని దుయ్యబట్టారు. విశ్వసనీయతకు, విధేయతకు ప్రాధాన్యతనిచ్చే గొప్ప వ్యక్తి జగనన్న అనే విషయాన్ని రాష్ట్ర ప్రజలంతా గమనించారన్నారు. టీడీపీ, ఎల్లో మీడియా ప్రభుత్వంపై, జగనన్నపై ఎంత బురద జల్లాలని చూసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీ భూస్థాపితం కావడం ఖాయమని, కుప్పంతో సహా టీడీపీ కంచుకోటలన్నీ వైఎస్సార్ సీపీ బద్దలుకొట్టడం తథ్యమన్నారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడారు. కార్పొరేషన్ ఈఈ శ్రీనివాస్, డీఈ రామకృష్ణ, ఏఈ అరుణ్‌కుమార్, సీడీఓ జగదీశ్వరీ, వైఎస్సార్‌సీపీ నాయకులు మోదుగుల గణేష్, సీహెచ్ రవి, నాగు తదితరులు పాల్గొన్నారు.

పాలిక్యాబ్ అరెనా ఎక్స్‌పీరియన్సియల్ స్టోర్ ప్రారంభం



విజయవాడ వన్‌టౌన్‌లో ప్రారంభమైన పాలిక్యాబ్ అరెనా స్టోర్

విజయవాడ స్పోర్ట్స్: దేశంలోనే ప్రముఖ ఎలక్ట్రికల్ గూడ్స్ కంపెనీ పాలిక్యాబ్ ఇండియా లిమిటెడ్ (పీఐఎల్) తన ఎక్స్‌పీరియన్సియల్ రిటైల్ స్టోర్ పాలిక్యాబ్ అరెనాను విజయవాడ వన్‌టౌన్‌లోని బొడెమ్మ హోటల్ వద్ద ఏర్పాటు చేసినట్లు సంస్థ అధ్యక్షుడు, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ నిలేష్ మలాని తెలిపారు. ఈ రిటైల్ స్టోర్‌ను గురువారం ప్రారంభించామన్నారు. ఈ స్టోర్‌లో ఫ్యాన్స్, లైటింగ్, స్విచ్, స్మార్ట్ ఆటోమేషన్ ఉత్పత్తులు, కేబుల్ వైర్లు తదితర ఎలక్ట్రిక్ ఉత్పత్తులు కస్టమర్‌లకు అందుబాటులో ఉంటాయన్నారు. పాలిక్యాబ్ దేశ వ్యాప్తంగా 4,600 కు పైగా అధీకృత డీలర్లు, పంపిణీదారులు, 2.05 లక్షల రిటైల్ అవుట్‌లెట్ డీలర్ల ద్వారా ఉత్పత్తులను కస్టమర్‌లకు చేర్చుతుందన్నారు. తమ సంస్థ దేశంలోనే అతిపెద్ద వైర్లు, కేబుల్స్ తయారీదారుగా గుర్తింపు తెచ్చుకుందన్నారు.

లారస్ ల్యాబ్స్ లిమిటెడ్‌తో సిద్ధార్థ కళాశాల ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్పిడి చేసుకుంటున్న కళాశాల, కంపెనీ ప్రతినిధులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ప్రముఖ ఔషధ తయారీ సంస్థ లారస్ ల్యాబ్స్ లిమిటెడ్‌తో తమ కళాశాల ఒప్పందం చేసుకుందని సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు చెప్పారు. గురువారం కళాశాల ఆవరణలో లారస్ ల్యాబ్స్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీవీ రవికుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్, రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.మనోరంజని ఒప్పంద పత్రాలు మార్పిడి చేసుకున్నారు. ఈ ఒప్పందం వల్ల తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు లారస్ ల్యాబ్స్ సంస్థ అందించే నైపుణ్యాలను ప్రయోగపూర్వకంగా నేర్చుకోవడమే కాకుండా ఆ సంస్థలో ఇంటర్న్‌షిప్ చేయడానికి, ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యం ఇస్తారన్నారు. లారస్ ల్యాబ్ మానవ వనరుల విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ చావా నరసింహారావు, హెచ్ఆర్. మేనేజర్ డి.సునీత, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

లారీల నుంచి ఆశీలు వసూలు ఆపాలి

గన్నవరం: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు, హైకోర్టు తీర్పుకు అనుగుణంగా లారీల నుంచి ఆశీలు వసూలును నిలుపుచేయాలని ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తుమ్మల లక్ష్మణస్వామి తెలిపారు. స్థానిక సంఘ కార్యాలయంలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. జీఓ నెం. 551 ప్రకారం లారీల నుంచి ఆశీలు వసూలు చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. వీటిని సమరిస్తూ 2004లో హైకోర్టు తీర్పు కూడా ఇచ్చిందన్నారు. కింది స్థాయిలో అధికారులు అమలు చేయకపోవడంతో లారీ ఓనర్స్ ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ముఖ్యంగా గన్నవరం పంచాయతీలో ఆశీలు పాటదారులు లారీల నుంచి బలవంతంగా వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఆశీలు వసూళ్లను నిలిపివేయకపోతే మరోసారి న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి వీరవెంకయ్య, నేతలు అన్నపురెడ్డి శివప్రసాద్‌రెడ్డి, వింత రవీంద్రరెడ్డి, చెరుకూరి వేణుగోపాల్, శ్రీహరి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.